విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలు సత్వరం పరిష్కారం కావాలి

- స్పందనలో 124 అర్జీలు రాక
- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జగనన్నకు చెబుదాం స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జంగారెడ్డిగూడెం వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన జంగారెడ్డిగూడెం మండలానికి సంబంధించిన జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ వారితో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, ఆర్డీవో ఝాన్సీరాణి,డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, డ్వామ పిడి రాము,డి జిఎస్ డబ్ల్యూఎస్ నోడల్ అధికారి రమణ,మైనారిటీ సంక్షేమ అధికారి కృపావరం అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, స్థానిక తహశీల్దార్ స్లీవ జోజి, ఎంపిడివో కెవి ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో 124 అర్జీలు అందాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు పోరాడుతుంటే వారిపై పోలీసులను ఉపయోగించి జరిపిన నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఊరేగింపులు నిరసన తెలియజేసే ప్రాథమిక హక్కుకు రాష్ట్ర ప్రభుత్వం భంగం కలిగించిందన్నారు. తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని మహిళలపై ప్రయోగించటం రాక్షస చర్యగా భావిస్తున్నామని తెలిపారు. అంగన్వాడి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీసం రూ.26 వేలు వేతనాన్ని చెల్లించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రాహుల్, సంజయ్

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి లీగ్ వాలీబాల్ పోటీలకు వి ఎస్ ఎన్ జూనియర్ కళాశాలకు చెందిన యంగళ రాహుల్, పాక సంజయ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ విఎస్ఎన్ స్వామి తెలిపారు. పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో విఎస్ ఎన్ జూనియర్ కళాశాల నుండి తమ విద్యార్థులు పాల్గొన్నారని రాహుల్, సంజయ్ లు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని స్వామి తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థిని విద్యార్థులు, పలువురు అభినందించారు.

ఉండి మండల తహసీల్దారుగా ఏడిద శ్రీనివాస్

విశాలాంధ్ర-ఉండి: ఉండి మండల తహసీల్దార్ శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్చార్జి తహసిల్దార్ గా పనిచేస్తున్న స్వామి నాయుడు తహసిల్దార్‌గా నియమితులైన ఏడిద శ్రీనివాస్‌కు బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.23లక్షలతో బోరు, మంచినీటి ట్యాంక్ నిర్మాణం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రజలకు మంచినీటి కొరత లేకుండా ఉండడం కోసం బోడి గూడెం గ్రామంలో జల జీవన్ పథకం ద్వారా రూ.23 లక్షలతో మంచినీటి ట్యాంకు, మంచినీటి బోరు నిర్మించడం జరుగుతుందని బోడిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ కడకట్ల గడ్డియ్య పేర్కొన్నారు. మండలంలో బోడిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకు వద్ద మంచినీటి బోరు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డియ్య మాట్లాడుతూ ప్రజా దాహార్తిని తీర్చడానికి శాసనసభ్యుల ఆదేశాల మేరకు ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల నాయకుల సహాయ సహకారాలతో నిర్మాణం చేపట్టి నూతన బోరు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసు బోయిన సత్యనారాయణ, చల్ల సుబ్బారావు, తేలే నాగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21న ప్రత్యేక లోక్ అదాలత్

విశాలాంధ్ర- ఏలూరు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో అక్టోబర్ 21వ తేదీ న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కేసులు, వాహన ప్రమాదాల కేసుల ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కె.కె.వి.బులి కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గత నెలలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 65 వాహన ప్రమాద కేసులను రాజీ చేసినట్టు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో కూడా వాహన ప్రమాద కేసులను రాజీ చేసుకోవడం కోసం కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, రెవెన్యూ కేసులను కూడా ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీ చేస్తారన్నారు. కేసుల రాజీ చేసుకోవడంలో సందేహాలున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థను 08882 22455 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు నని తెలిపారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.12 (1744533) / 2019/ డి.బి. తేది : 26-09-2023

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో **టెండరు నోటీసు నెం.8(1-5) /BH/ జనరల్/NUHM & APHSSP/2023-24/E1 & షార్టు టెండరు నోటీసు నెం.8(6-15) /BH/ జనరల్/2023-24/E1/E2** లోని జనరల్ ఫండ్స్ నుండి 14 పనులకు సంబంధించి **రూ.138.06 లక్షలకు** గాను, NUHM & AHSSP ఫండ్స్ నుండి 1పనికి సంబంధించి **రూ.50.00 లక్షలకు** గాను ఇ- ప్రోక్యూరుమెంటు ద్వారా టెండర్లు **జి.వో.ఎమ్.ఎస్ నెం : 94** లేక దానిపై ఇతర అనుబంధ జి. వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇప్రోక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా (సెల్: **9849906540, 9849906548**) వారిని సంప్రదించగలరు.

కమిషనరు,
భీమవరం పురపాలక సంఘం

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలి

వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించకపోతే మరో ప్రజా ఉద్యమం తప్పదని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. వివిధ రకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు చార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ,ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్ట రేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు. వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రజలకు విద్యుత్తు అనేది నిత్యావసర వస్తువుగా మారిందని, విద్యుత్ పై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలో బిజెపి షరతులకు లొంగిపోయి విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్నదని విమర్శించారు. ప్రజలపై ట్రూ అప్ టారిఫ్, సర్దుబాటు, సర్వీసు, అదనపు చార్జీలు అంటూ రకరకాల పేర్లతో ధరలు పెంచారని విమర్శించారు. అదాని కంపెనీకి కాంట్రాక్టు ఇస్తూ విద్యుత్తు స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తున్నదని విమర్శించారు. ఇకపై సెల్ ఫోన్ బ్యాలెన్స్ రీఛార్జ్ చేసు కున్నట్లు విద్యుత్‌కు కూడా ముందుగానే డబ్బులు రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెంచి ప్రజల పైన భారాలను మోపుతున్నారని విమర్శించారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కె.వి.రమణ మాట్లాడుతూ విద్యుత్ భారాలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు. ప్రజల సంపదను అదాని, అంబానీలకు కారు చౌకగా దోచిపెడుతున్నారని విమర్శించారు. విద్యుత్ సవరణలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అమలు చేయకపోగా మన రాష్ట్రంలో మాత్రం ముఖ్య మంత్రి జగన్ అమలు చేయడానికి ఉవ్విళ్లూరు తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను నిర్బంధించడాన్ని మానుకోవాలని లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలను కాలగర్భంలో కలిపేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, దాలి నాయుడు, ఎంఏ హకీమ్, కొల్లూరు సుధారాణి, ఎస్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు మావూరి విజయ, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి, ఉప్పులూరి భవాని, మేరీ,సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సిపిఎం జిల్లా నాయకులు పి. కిషోర్, కె శ్రీనివాస్, పి. రామకృష్ణ, బి. సోమయ్య, పి. ఆదిశేషు, ఐ.ఎఫ్ టి.యు. జిల్లా నాయకులు పి. నాగేశ్వరరావు, ఇ.గ్రీష్మ కుమార్, ఎం.డి.వి. ప్రసాద్, ఎర్రా శ్రీనివాసరావు, అప్పారావు,నెహ్రూ బాబు కాకర్ల శ్రీను, ఎం. రాము, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దండు బోయిన చంద్రశేఖర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందాలి

జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి

విశాలాంధ్ర-గణపవరం: అన్నదాతలు ఆరోగ్య దాతలుగా మారాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పనపేట గ్రామంలో డాక్టర్ వైయస్సార్ క్లస్టరు పొలంబడి కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్ర మంలో రైతులతో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఆరోగ్యమైన పంటలు పండిస్తే అందరికీ ఆరోగ్యంగా ఉండి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మొక్కకు కూడా ప్రాణం ఉంటుందని, మనం ఎక్కువ మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడితే పంట దిగుబడి తగ్గి అధిక ఖర్చు అవుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా చేసినట్లయితే ఖర్చు తగ్గి ఆరోగ్యమైన పంటలు పండించుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రకృతి వ్యవసాయం తప్పనిసరిగా చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు, తహశీల్దారు పి.లక్ష్మి, యంపిడివో జి. జ్యోతిర్మయి, ఏడిఏ పి మురళీ కృష్ణ, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడిఆర్ ప్రభాత లక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి వై. ప్రసాదు, జడ్పీటిసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, సర్పంచి నక్క సురి బంగారయ్య , ఉప సర్పంచ్ నూకపరు సుధాకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సచివాలయాల పరిధిలలో పనిచేసే ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు అవగాహన కల్పించి వారి ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య పరీక్షలు నిర్వహించాలని కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి ఎస్తేరు రాణి సూచించారు. కొయ్యలగూడెం పట్టణంలో పరంపూడి గ్రామపంచాయతీ సచివాలయం 1 ఏరియాలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను వైద్యాధికారిణి ఎస్తేరు రాణి, సిహెచ్ఓ నాగమణి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు, తమ పరిధిలో ఉన్న ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి యాప్ లో పొందుపరచాలని , పరీక్షల అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు హాజరు అవ్వవలసిన రోగికి టోకెన్ అందించాలన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అర్థమయ్యే రీతిలో ప్రజలకు తెలియచేయాలని, ఆరోగ్య సిబ్బందికి ఆమె సూచించారు.

వారాహి యాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర -కైకలూరు : ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ ఆదేశాల మేరకు కైకలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సి ఏ బీ వీ రావు ఆధ్వర్యంలో భైరవ పట్నం శుభం ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ అధ్యక్షుల పవన్ కళ్యాణ్ 4 వ విడత జరగబోయే వారాహి విజయ యాత్ర కైకలూరు నియోజకవర్గంలో జరగబోయే వారాహి సభ ఏర్పాట్లు గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రావు మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం పార్టీ కలిసి సమిష్టిగా ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతోనే సత్ఫలితాలు

విశాలాంధ్ర-ముదినేపల్లి : సామూహిక ఎలుకల నిర్మూలనతోనే సత్ఫలితాలు సాధించవచ్చునని వ్యవసాయశాఖ ఏడిఏ జి. వెంకటమణి రైతులకు సూచించారు. మండలంలోని దాకరం గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం రైతులతో చేపట్టారు. మండలంలోని రైతులతో ఎలుకల నివారణ చేపట్టడానికి ప్రభుత్వం వందశాతం రాయితీతో బ్రోమోడైలోన్ మందును సరఫరా చేయడం జరిగిందన్నారు. పొలాల్లో ఎలుకల బొరియలను గుర్తించి మందు పెట్టి ఎలుకలను నివారించాలన్నారు. ఏవో వేణుమాధవ్ మాట్లాడుతూ మండలంలో 97 కిలోల మందును రైతులకు సరఫరాకు అన్ని ఆర్ వి కె కేంద్రాలలో మందు అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ లు , రైతులు పాల్గొన్నారు.

ఇంటి దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం పట్టణానికి చెందిన **నీలం అలివేలు మంగతాయారు (భర్త) వెంకటేశ్వరరావు** అనువారికి పట్టణంలోని **సర్వే నెంబర్ 334/4 లొ 118 గజాల స్థలములో** బిల్డింగ్ కలదు. ఇంటి దస్తావేజులను జిరాక్స్ తీయించడం కోసం **7-8-2023వ** తేదీన ఇంటి వద్ద నుండి బయలు దేరి వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినవి దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

నీలం వెంకటేశ్వరరావు. కొయ్యలగూడెం, కొయ్యలగూడెం మండలం ఏలూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్. పిన్ నెంబర్ - 534312. సెల్ నెంబర్ : 9848949290.

CHANGE OF NAME

I, Katikatala Ratna Kumari (Old Name) W/o. Katikatala Gilbertgibs Residing at # 9-1-34, Opp. Ambedkar Community Hall, Vennavallivaripeta, Eluru Mandal, Eluru District, A.P.-534001. India. I changed my name to **KATIKATALA VIJAYA RATNA KUMARI** (New Name) Hence forth I will be known as **KATIKATALA VIJAYA RATNA KUMARI**

పీఎం విశ్వకర్మ యోజన పథకం పల్లెల్లోకి విస్తరించాలి

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పథకం పీఎం విశ్వకర్మ యోజన పథకం చేతి వృత్తుల వారికి ఎంతో దోహదపడుతుందని ఈ పథకం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కోరారు. బుధవారం అసెంబ్లీలో రవీంద్రనాథ్ తన వాణిని వినిపించారు. విశ్వకర్మ పథకం ద్వారా రూ.3 లక్షలు ఎటువంటి హామీ లేకుండా 5 శాతం వడ్డీకి లభిస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కోసం గ్రామ స్థాయి వరకు ప్రచారం చేసేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు. మూడు వేల కోట్ల వరకు మన రాష్ట్రంలోని వృత్తి నిపుణులు ఈ సౌకర్యం పొందవచ్చన్నారు. దేవాలయ పురోభివృద్ధి పై మాట్లాడుతూ ముఖ్యమంత్రి దేవాలయాల ప్రాంగణంలో వస్తువులు ఎక్కువ ధరకు అమ్మకుండా చర్యలు చేపట్టాలని, ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని రాత్రి 7 గంటల వరకు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - లింగపాలెం/చింతలపూడి : పాచ్చానగరంలో పిడుగుపాటుకు మృతి చెందిన సొంగ దేవమాత, సొంగ మనీషా కుటుంబాలకు ప్రభుత్వం రూ. 4 లక్షలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిందని నూజివీడు సబ్ కలెక్టర్ జి.వి.వి.సత్యనారాయణ వెల్లడించారు. బుధవారం ఆయన చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో మృతులకు నివాళులర్పించి వీరి కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ సాయాన్ని ప్రకటించారు. పిడుగుపాటులో గాయపడిన జోత్స్నను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈయనతోపాటు లింగపాలెం తహశీల్దార్ మురళీకృష్ణ ఉన్నారు. పోలీసులు కేసునమోదు చేశారు. మృతులకు శవపంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబాలను లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగ సందీప్ పరామర్శించారు.

ఫ్లై ఓవర్ వంతెనల పరిశీలన

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో ఉంగుటూరు, చేబ్రోలు, కైకరం గ్రామాలలో రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెనలు అండర్ నిర్మాణాలు కోసం బుధవారం మూడు శాఖల అధికారులు పరిశీలించారు. ఈ మూడు మేజర్ పంచాయతీలు గ్రామాలలో రైల్వే గేటు వలన ట్రాఫిక్ సమస్యతో ఉండటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.రైల్వే గేట్‌ను దాటి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అనువైన ఫ్లైఓవర్ వంతెనలు , అండర్ పాస్ నిర్మాణాల కోసం సాధ్యాసాధ్యాలపై రైల్వే, ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు రైల్వే గేట్లను సందర్శించారు. ఫ్లై ఓవర్ వంతెన నిర్మిస్తే 500 మీటర్ల పొడవు, 25 మీటర్లు వెడల్పు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఎంత మేరకు స్థలం కాళీ ఉందో వివరాలు సేకరించారు. రైల్వే శాఖ, ఆర్ అండ్ బి శాఖ ఫ్లై ఓవర్ వంతెన పై చర్చించారు. ఉంగుటూరు తహసీల్దార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజారామ్‌మోహన్‌రాయ్ గొప్ప దేశ భక్తులు

విశాలాంధ్ర -భీమవరం: గొప్ప దేశభక్తులుగా, మానవతావాదులుగా, మేధావులుగా భగత్ సింగ్, రాజారామ్ మోహన్ రాయ్ లు చరిత్రలో నిలిచిపోతారని అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా వైద్య కేంద్రం ప్రతినిధి వి.రాధాకృష్ణ అన్నారు. భగత్ సింగ్ 115వ జయంతి, రాజా రామ్మోహన్ రాయ్ 190వ వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం వద్ద బుధవారం వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రెండు పదుల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్య వాదంనకు వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం, సోషలిజం కోసం ప్రాణాలు అర్పించిన షాహిద్ భగత్ సింగ్ చరిత్రలో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కన్వీనర్ తోట భోగయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కామన నాగేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు ఇంటి సత్యనారాయణ, మేంటే వారి తోట యూత్, వైద్య సహాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా సామూహిక ఎలుకల నిర్మూలన

విశాలాంధ్ర-దెందులూరు: జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ తెలిపారు. బుధవారం సోమవరప్పాడు గ్రామంలో ఎలుకల నిర్మూలనకు జరుగుతున్న మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా లక్షా 33 వేల 300 ఎకరాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టామని రామకృష్ణ తెలిపారు. ఇందుకోసం 532 కేజీల బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేశామన్నారు. స్థానికరైతులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎలుకల నిర్మూలన చేపట్టి పంట దిగుబడిని పెంచుకోవాలని సూచించారు. వీరి వెంట వ్యవసాయశాఖ కమీషనరేట్ డిడిఏ జి.సునీత, ఏరువాక డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ టి. సుజాత, వ్యవసాయశాస్త్రవేత్త ఫణి కుమార్, డిప్యూటీ డైరెక్టర్ వై. సుబ్బారావు, ఎఓ జి. రమేష్, వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు ఉన్నారు.

విద్యుత్ భారాలపై ప్రజా పోరు తప్పదు

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్లాబులు కుదింపు, ఇళ్లకు, షాపులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, ఇంధన చార్జీలు అంటూ ప్రభుత్వం ప్రజలను అడ్డంగా దోచేసుకుంటుందని వీటిని అడ్డుకోవడానికి ప్రజా పోరాటాలకు వెనుకాడబోమని ప్రభుత్వం దిగి రావాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దారుణంగా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అదనపు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం భీమవరంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ ప్రజలపై ఎటువంటి భారాలు మోపబోమని ఎన్నికల్లో వాగ్దానం చేసి గద్దెనెక్కిన జగన్ ప్రజా సంక్షేమానికి తూట్లు పొడుస్తూ ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారని అన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో 50,000 కోట్ల రూపాయలను జగన్ సర్కారు ప్రభుత్వం ప్రజలపై వేసిందని విమర్శించారు. పెరిగిన విద్యుత్ భారంతో ప్రతి కనెక్షన్‌కు రూ. 13000 భారం వినియోగదారులనుండే వసూలు చేయడం దారుణమని కోనాల పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలవల్ల లఘు,కుటీర పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. వ్యాపారాలు దెబ్బతిని, ఉపాధి తగ్గుతోందన్నారు. డిస్కమ్స్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిపై వడ్డీ కూడా ప్రజల నెత్తిన రుద్దుతున్నారన్నారు. కేంద్రంలో మోడి ఏది చెబితే ఆ విధానాన్ని రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి అమలు చేయడం దారుణమన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భీమవరం రూరల్ సిపిఐ కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, తణుకు సిపిఐ ఏరియా కార్యదర్శి బొద్దాని నాగరాజు, బొద్దాని కృష్ణకిషోర్, నామన వెంకటేశ్వరరావు, మల్లుల శ్రీనివాసరావు, టి.అప్పల స్వామి, పెద్దిరాజు, ఎం.లక్ష్మీపతి, దిలీప్, తిరుమాని కామేశ్వరరావు, సిపిఎం నాయకులు చింతకాయల బాబూరావు, జె.ఎన్.వి. గోపాలన్, నాయకులు జుత్తిగ నరసింహం, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, దూసి కళ్యాణి, వైకుంఠరావు, ఫార్వర్డు బ్లాక్ పట్టణ కార్యదర్శి దండు శ్రీనివాస రాజు, యంసిపిఐ(యు)నాయకులు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో టూరిజం అభివృద్ధికి టూరిస్టులను ఆకర్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండి. హెచ్. మెహరాజ్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా హేలపురి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కరోనా పరిస్థితుల తర్వాత జిల్లాలో టూరిజం రంగం పుంజుకుందన్నారు. పర్యాటకుల కోసం పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. పర్యాటకుల కోసం మౌలికవసతులు పెంచామని అన్నారు. హేలపురి ఇంజి నీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. మోహన్ రెడ్డి, జిల్లా టూరిజం మేనేజర్ పట్టాభిరామన్న ప్రసంగించారు. పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ అధికారి ప్రవీణ్ కృష్ణ, సెట్ వెల్ సూపరింటెండెంట్ జాన్ కెన్నెడీ, అకౌంటెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాణాలను పణంగా పెట్టి మహిళను కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఏలూరు శివారు వట్లూరు రైల్వే ట్రాక్‌పై ఒక యువకుడు తన భార్యను బ్లేడ్‌తో దాడి చేస్తున్నట్లుగా సమాచారం అందుకున్న 3 వ పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుళ్లు కె.ఏడుకొండలు, ఐ.శ్రీనివాసరావు కానిస్టేబుల్, కె రమేష్ లు రైల్వే ట్రాక్ పైకి వెళ్లి చాకచక్యంగా భర్త చేతుల్లో నుంచి భార్యను కాపాడారు. పోలీస్ సిబ్బంది ధైర్య సాహసాలను గురించి తెలుసుకున్న ఏలూరు జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి బుధవారం సిబ్బంది చేసిన ధైర్య సాహసాలకు గుర్తింపుగా క్యాష్ రివార్డ్‌ను అందజేశారు. పోలీసుల పేరు ప్రతిష్టలను నిలబెట్టినందుకు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి ఈ. శ్రీనివాసులు, ఎస్.బి సిఐ ఎం. సుబ్బారావు, 3వ పట్టణ సిఐ కోమాకుల శివాజీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

విశాలాంధ్ర-మండవల్లి: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటానికి చర్యలు తీసుకున్నామని సర్పంచ్ మెండా ఝాన్సీ అన్నారు. మండవల్లి గ్రామంలో వెలగని వీధి లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-టీ నరసాపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని కె జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు తెలిపారు. స్థానిక సంఘ ఆవరణలో మహాసభ మధు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా ఇటీవల మరణించిన మాజీ అధ్యక్షులు వెలిది కృష్ణ మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ 38కోట్లు పరపతి వ్యాపారం, 4కోట్లు డిపాజిట్లు, పరపతేతర వ్యాపారంతో కలిపి 75 కోట్ల వ్యాపారంతో దిన దినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. గుర్లపల్లి గ్రామంలో దాతల సహకారంతో 50సెంట్లు స్థలం సేకరించి రైతుల సౌకర్యం కోసం 40 లక్షల అంచనా వ్యయంతో మల్టీ పర్పస్ గోడౌన్ నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.అల్లం చర్ల రాజు పాలెం గ్రామంలో ఎరువుల గోడౌన్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సన్లు వంటి పల్లి వెంకటేశ్వరరావు, కొరప్రోలు రవి చంద్ర శేఖర రెడ్డి, సర్పంచ్ తడికలపూడి శివ మాధవి కిషోర్,ఎంపిటిసిలు బొడ్డపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

విశాలాంధ్ర - లింగపాలెం : ములగలంపాడులో పేకాట స్థావరంపై ఎస్ఐ చెన్నారావు తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 7,200 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు

అరాచక పాలన అంతమొందిస్తాం

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా భయపడే ప్రసక్తి లేదని రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొంది స్తామని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ హెచ్చరించారు. తేదేపా, ఎస్ సి సెల్ రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ తక్షణం విడుదల చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలాజీ మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తున్నదని అన్నారు. తప్పులు చూపితే ఆక్రమ కేసులు పెడుతున్నారన్నారు.జగన్ పాలనతో జనం విసిగిపోయారన్నారు. లోటు బడ్జెట్ నుండి సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేసిన చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో విజయం తథ్యం అని ముఖ్యమంత్రి జగన్ భయపడిచంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, రేవులి గద్ద లాలా లజపతిరాయ్, మాజీ ఎంపీపీ మాణిక్యాలరావు, టిడిపి నాయకులు ఎల్ రవీంద్రబాబు, పూనూరు రాజేష్, శ్రీకాంత్, జాలా శివశంకర్, చిట్ల నాని, సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రపంచ రేబిస్ డే సందర్భంగా స్థానిక పశు వైద్యశాల వద్ద గురువారం కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబీస్ టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారి బి ఆర్ శ్రీనివాసన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కల పెంపకం దారులు, కుక్కలకు టీకాలు వేయించాలని, వాటి ఆరోగ్య పరిరక్షణకు సహాయ సహకారాలు అందించాలని ప్రతి ఒక్కరూ వైద్యశాల వద్దకు తమ కుక్కలను తీసుకువచ్చి రాబిస్ టీకాలు వేయించుకోవాలని పేర్కొన్నారు.

మహా అన్నసమారాధన ప్రారంభించిన ఎస్పి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: స్థానిక అమీనా పేట పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద గల అభయాంజనేయ స్వామి గుడి ప్రక్కన గల శ్రీసిద్ధి వినాయక ఆలయంలో వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. బుధవారం సిద్ధి వినాయక దేవాలయం ప్రాంగణం లోనూ మహా అన్నసమారాధన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి నిర్వహించారు. ఎస్పి స్వయంగా ప్రజలకు ఆహారం వడ్డించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఆకలి అన్ని వర్ణాలు, మతాల వారికి ఒకటేనని గ్రహించిన మన పూర్వీకులు పండుగ పర్వదినాలను పురస్కరించుకుని అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించే వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్ పి ఎస్. శేఖర్, ఏలూరు డిఎస్ పి ఈ శ్రీనివాసులు,ఎస్ బి సిఐ ఎం సుబ్బారావు, 1వ పట్టణ సీఐ ఏలూరు రాజశేఖర్, ఏ.ఆర్,ఆర్.ఐ పవన్ కుమార్, ఆర్.ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం పంచాయతీ పరిధిలో గొల్లలదిబ్బ ఆవు బొమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు బుధవారం తెలిపారు. రెండోవ వర్షికోత్సవం పురస్కరించుకుని వినాయక చవితిని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల సత్తిబాబు, డి.వి రమణ రాజు,చంపాటి నరసింహ రాజు,నంద్యల రవి కిరణ్ రాజు, నంద్యల సతీష్ రాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శనివారం గుడి వద్ద భారీ అన్న సమారాధన జరుగుతున్నట్లు తెలిపారు.

చంద్రబాబు అరెస్టుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉంచిన నేపథ్యంలో బుధవారం జంగారెడ్డిగూడెంలో ఏలూరు జిల్లా కలెక్టర్ నిర్వహించిన జగనన్నను చెబుదాం కార్యక్రమంలో తేదేపా ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు టిడిపి నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శేషు కలెక్టర్‌తో మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కుట్రలో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసారన్నారు. అరెస్ట్ చేసి 19 రోజులు గడిచినా నేటివరకు ఎలాంటి ఆధారాలు చూపలేదని, లేని, వేయని ఇన్నర్ రింగురోడ్డులో అవినీతి జరిగిందని కేసు పెట్టడం అత్యంత ఘోరమైన చర్య అన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి.ఎల్.టి.సి,ఐటిఐ సహాయ సంచాలకులు ఎస్. ఉగాది రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 15 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని ఆయన తెలిపారు. ఈ నెల 30 చివరి తేదీ వివరాలకు 9493482414,9494963143 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - నిడమర్రు: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం నిడమర్రు మండలం శాఖ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిడమర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లావేటి సోంబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వ్యవసాయం చేసే కౌలు రైతులు నష్టపోయిన వారందరికీ నష్ట పరిహారం అందించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కట్టబెట్టాలని ఉద్దేశంతో 660 జీవో ఇచ్చింది. ఆ జీవో రద్దుచేసి నష్టపోయిన రైతులు కౌలు రైతులు ప్రభుత్వ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం నిడమర్రు తహసిల్దార్ బి సాయి రాజ్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో వెలగలేటి మోహన, కానూరు రాజు,నేతి దొరబాబు, దుత్తాడ వెంకన్న, మిండిబాపి రాజు, మురపాకి నరసింహమూర్తి, దండుపాటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: నాడు నేడు పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శ్యాంసుందర్ హెచ్చరించారు. బుధవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మండలంలో నాడు నేడు ఫేజ్-2 పనులు నిర్వహిస్తున్న 55 పాఠశాలల పురోగతిని మండల విద్యా శాఖ అధికారులు బి. రాముడు,జి.రాములు ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలకు రివాల్వింగ్ ఫండ్ రూ. 63.48 లక్షలు జమ అయితే కేవలం రూ.45.90 లక్షలు మాత్రమే ఖర్చు చేయడం పై పాఠశాల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం అదే పాఠశాలలో జరుగుతున్న ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఉండవలసిన మెలకువలను ఆయన తెలియజేసారు. ఈ కాంప్లెక్స్ సమావేశం నందు బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల నుండి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సామూహిక ఎలుకల నిర్మూలన

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరు ఏవో బాలిన వెంకటేష్ ఆధ్వర్యంలో బ్రోమోడయోలిన్‌ను నూకల మిశ్రమంలో కలిపి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షులు బండారు నాగరాజు, ఎంపిటిసి అరవెల్లి మహాలక్ష్మి దానయ్య, రైతు భరోసా కేంద్రం చైర్మన్ మత్తుకుమల్లి, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏవో బాలిన వెంకటేష్, సర్పంచ్ బండారు సింధు, మధుబాబు, రైతు భరోసా కేంద్రం చైర్మన్లు తల్లాటి శివరామ కృష్ణ, మంద పాపారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

విశాలాంధ్ర-ఏలూరు: శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాల సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈనెల 26 నుండి 29వ తేదీ వరకు జరుగు స్థానిక ఆర్ఆర్ పేట శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం 22 వ వార్షిక పవిత్రోత్సవములు రెండవ రోజు కార్యక్రమాలకు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాసరావు, ఈవో నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో తొలుత ఆలయ మర్యాదలతో మేయర్ దంపతులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, బత్తిన విజయకుమార్ ధర్మకర్తల మండలి సభ్యులు అర్చకులు మారుతి తదితరులు ఉన్నారు.

పోలసానిపల్లి గురుకులంలో జిల్లా స్థాయి బాలిక క్రీడా పోటీల ఎంపికలు

విశాలాంధ్ర-భీమడోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 (బాలికల) జిల్లాస్థాయి పోటీలు పొలసానిపల్లి గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించినట్లు స్పోర్ట్స్ స్కూల్ జిల్లా సమన్వయకర్త కె. జయరాజు, ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి తెలిపారు. క్రీడాపోటీలలో భాగంగా తపక్ తక్రా, టెన్నికాయిట్ ,త్రోబాల్ గేమ్స్ తో పాటు ఐదు రకాల అథ్లెటిక్స్ లోని వివిధ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కు వివిధ పాఠశాలలు, కళాశాలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధులుగా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

టిఎన్‌ఆర్ టవర్స్‌లో ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

విశాలాంధ్ర- కైకలూరు : ఆదిపూజ్యుడు.. విఘ్ననాయకుడు.. లంబోదరుడు.. గణనాధుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కోరుకొల్లు రోడ్డులోని టిఎస్ఆర్ టవర్స్‌లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిసాయి. వినాయక చవితి (గత సోమవారం) నుంచి బుధవారం వరకు టిఎస్ఆర్ టవర్స్‌లో ఉన్న కుటుంబీకులంతా నవరాత్రి ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహించారు. రోజుకో దంపతులు చొప్పున 9 రోజులపాటు ప్రతి రోజు పీటలపై కూర్చుని ఉభయదంపతుల పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని బుధవారం ఉదయం 200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. టిఎస్ఆర్ టవర్స్ అధినేత తానా ప్రసాద్-శ్రీలక్ష్మి దంపతులు అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో అద్దంకి వెంకట శ్రీనివాసరావు, అల్లూరి బాపిరాజు, అట్లూరి కోటేశ్వరరావు, కొణిజేటి విష్ణుమోహనరావు, ఇంటి గోవిందరాజు తదితరులతోపాటు టిఎస్ఆర్ టవర్స్ కుటుంబీకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జయంతి

విశాలాంధ్ర-భీమడోలు: స్వాతంత్ర సంగ్రామంలో భగత్ సింగ్ పాత్ర కీలకమని ఇలాంటి పోరాట యోధుల కృషి ఫలితమే నేడు స్వాతంత్రం అని భీమడోలు మానస పాఠశాల ప్రిన్సిపాల్ ఎలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. భీమడోలు మానస పాఠశాలలో భగత్ సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ ఫోటోతో చిన్నాలు చేసిన మార్చ్ ఫస్ట్ ఆకర్షించింది. కార్యక్రమంలో భాగంగా భీమడోలు ఎస్ ఐ చావా సురేష్ కుమార్తె కృష్ణసుకృతి చెప్పిన భగత్ సింగ్ జీవితగాథ ఆలోచింపజేసింది. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాల పట్ల అవగాహన అవగాహన కలిగి ఉండాలని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.

చంద్రబాబు అరెస్టు దారుణం

విశాలాంధ్ర -భీమవరం: చంద్రబాబు అక్రమ కేసులను నిరసిస్తూ భీమవరంలో తెలుగు యువత నాయకులు రిలే నిరాహారదీక్షలు చేపట్టి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు పరిణామాల అనంతరం 19 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజానీకం, టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ, బ్లాక్ ఫార్వర్డ్ రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటిస్తున్నా జగన్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిం చడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసుల్లో న్యాయస్థానాల ద్వారా న్యాయం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలుత నిరాహారదీక్షా శిబిరం వద్ద చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతి చెందిన స్థానిక టీడీపీ నాయకుడు షేక్ వల్లి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయపల్లి వెంకట్, గంట త్రిమూర్తులు, కోళ్ల నాగబాబు, కముజు హరిబాబు, కొయ్యలగడ్డ గణపతి, వీరమల్లు వెంకట్, గండి భూషణం, ప్రధాన కార్యదర్శి దూసనపూడి నరేష్, గూడూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జనంలోకి జనసేన

విశాలాంధ్ర-తణుకు: జనంలోకి జనసేన -జనం కోసం జనసేన కార్యక్రమం తణుకు నియోజకవర్గం ఇన్‌చార్జి గుడివాడ రామచంద్ర రావు ఆధ్వర్యంలో జరిగింది. నియోజకవర్గంలోని ఆరవల్లి గ్రామంలో విడివాడ రామచంద్రరావు ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలను ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను కరపత్ర రూపంలో తెలియజేస్తూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆరవల్లి గ్రామస్తులు కోరారన్నారు. ఈ కార్యక్రమంలో దాసం ప్రసాద్, నియోజకవర్గస్థాయి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - నిడదవోలు : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేయడం తృప్తినిచ్చిందని కుమారుడు వరసాల శాంతారామ్ అన్నారు . తల్లిదండ్రులు వరసాల సీతయ్య, మేరీ రత్నం జ్ఞాపకార్థం కుమారుడు శాంతారామ్ ఆర్థిక సహకారంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏ వి ఆర్ ఎస్ తాతరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గుర్రం జేమ్స్, పడాల రాజేష్ ,తీట్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

యర్రంపాలెంలో ఎలుకల నిర్మూలన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామంలో జిల్లా స్థాయి సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం జేడిఏ ఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం ఎలుకలు మందు పంపిణీ చేస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఎలుకలు వలన వరి చేలో 35% శాతం, నిల్వ సమయంలో 15% శాతం నష్టం వాటిల్లుతుందని దీని నివారణ కొరకు రుచి, వాసన మరియు రంగు లేని బ్రోమోడయోలిన్ మందును నూకలు, నూనె తగు పాళ్లలో కలిపి గుర్తించిన ఎలుకలు బొరియలు వద్ద ఉంచడం ద్వారా వీటి ద్వారా ఏర్పడే నష్టం నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు ఓబ్బిన వీరబాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ వారు పంపిణీ చేస్తున్న ఈ మందును సామూహికంగా చేయడం ద్వారా ఎలుకలు వలన కలిగే నష్టాన్ని చాలా వరకు నివారించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడిఏ హరి, (జిల్లా వనరులు కేంద్రం), ఏడిఏ వైవి గంగాధర్ కుమార్, ఏవో శ్రీరాం (జగ్గంపేట), ఏవో సద్గురు మూర్తి, ఎమ్‌పిటిసి మద్దిపాటి రామక్రిష్ణ, గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు రవి, శ్రీహరి, సత్తిబాబు, బుజ్జి, విఏఏ సుమిత్ర, అలిషా, సత్యనారాయణ విహెచ్ఏ సాయికిరణ్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హోమం

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి మండలం యాదవోలులో లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం లక్ష్మీ గణపతి హెూమం వైభవంగా జరిగింది ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక పురోహితులు అయిలూరి సాయి పవన్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హెూమం జరిగింది. పొంగుటూరు గ్రామానికి చెందిన పసుపులేటి నరేష్ దుర్గ భవాని దంపతులు హెూమం నిర్వహించారు.

గణపతిలడ్డు వేలం

విశాలాంధ్ర - కొత్తపేట : గణపతి నవరాత్రిలు ముగియడంతో గణపతి పందిరిలో తొమ్మిది రోజులు స్వామి వద్ద ఉంచిన లడ్డూలను వేలంపాటనిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్‌లో గల చింతామణి గణపతి పందిరిలో 18 కేజీల లడ్డు పాట నిర్వహించగా వాసవి యూత్ 26,100 దక్కించుకున్నారు. అలాగే పొట్టి శ్రీరాములు వీధిలో గల వరసిద్ధి వినాయక కమిటీ నిర్వహించిన లడ్డు వేలం పాటలో 18 కేజీల లడ్డు గ్రంధి నానాజీ చాముండేశ్వరి దంపతులు రూ.17,600కి దక్కించుకున్నారు. అలాగే మరో ఏడు లడ్డులు పాటల నిర్వహించగా రూ.45400లు వచ్చినట్లు కమిటీ వారు తెలిపారు.

విఘ్నేశ్వరుని దర్శించుకున్న ఎస్వీబీసీ అడ్వైజర్

విశాలాంధ్ర - అయినవిల్లి : తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ అడ్వయిజర్ అడపా దుర్గ బుధవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరవలేదన్నారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలక మండలి, అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. దాతలు మరింతగా సహకరించి ఆలయ అభివృద్ధికి చేయూతనందించాలని ఆమె కోరారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గుత్తుల నాగబాబు, కార్యనిర్వహణాధికారి యం. సత్యనారాయణ రాజు, పాలకమండలి సభ్యులు కర్రి మంగాదేవి సుబ్రహ్మణ్యం, పులగుర్త మంగాదేవి మూర్తి, దుర్గను సత్కరించి విఘ్నేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

తాడిపర్రులో టీడీపీ నిరాహార దీక్ష

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా తెలుగు దేశం పార్టీ శ్రేణులు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం 16 వ రోజు తాడిపర్రు లో నిర్వహించారు. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దీక్షా శిబిరంలో నియోజకవర్గ, మండల, గ్రామ టిడిపి శ్రేణులు, జనసేన పార్టీ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. తాడిపర్రు గీతా పారాయణ బృందం చే శిబిరం వద్ద గీతా పారాయణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ ఉండ్రాజవరం మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి కరుటూరి నరేంద్రబాబు మద్దతు తెలిపారు.

పాలంగి సొసైటీ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: పాలంగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వంద శాతం రుణాలు వసూలు చేసినట్లు సంఘ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన అధ్యక్షతన సొసైటీ భవనంలో నిర్వహించిన మహాజన సభలో మాట్లాడారు. 2022- 2023 సంవత్సరానికి ఆడిట్ రిపోర్ట్ నికర లాభం 96, 907 గా ఉన్నట్లు తెలిపారు. సంఘ సభ్యుల రుణాలు సుమారు 10 కోట్లు ఉన్నాయని, వంద శాతం రుణాలు వసూలు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెర్సన్ వాండ్ర లక్ష్మి, వెలిచేటి జానకి రామయ్య, వెలిచేటి బోసు, బొల్లాడ రంగారావు, సకినాల నారాయణమ్మ, బసవ రమణమ్మ, సీఈవో పి విష్ణుమూర్తి, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ట్రెండ్స్ ఫ్యాషన్ డెస్టినేషన్ కైకలూరులో ప్రారంభం

విశాలాంధ్ర-కైకలూరు: రిలయన్స్ రిటైల్ యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న దుస్తులు మరియు యాక్సెసరీస్ ప్రత్యేక షాప్ ట్రెండ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కైకలూరు పట్టణంలో తన కొత్త స్టోర్ ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ట్రెండ్స్ భారతదేశంలో ఫ్యాషన్ ను ప్రజాస్వామ్యీకరించడం ద్వారా, మెట్రోలు, మినీ మెట్రోల నుండి టైర్ 1, 2 పట్టణాల లో విస్తరిస్తుంది. కైకలూరులోని ట్రెండ్స్ స్టోర్‌లో ట్రెండీ ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్ససరీస్ అందుబాటు ధరలలో ఉన్నాయి. కైకలూరు పట్టణంలో మొట్టమొదటి ట్రెండ్ స్టోర్ 7270 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. రూ.3999 షాపింగ్ చేసి రూ.249 వద్ద బహుమతిని, పొంద రూ.3999 కొనుగోలుపై రూ.2000 విలువైన కూపన్ ను పూర్తిగా ఉచితంగా పొందుతారని సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

ఏలూరులో ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి

విశాలాంధ్ర- కాకినాడ: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అందుబాటు ధరల (సరసమైన) గృహ ఋణ (హౌసింగ్ ఫైనాన్స్) కంపెనీలలో ఒకటైన ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, ఏలూరులో తమ మొదటి శాఖతో ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది రాష్ట్రంలో సంస్థకు 9వ శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఈ విస్తరణ, రాష్ట్ర మంతటా వీలైనంత ఎక్కువ మందికి సరసమైన ధరల్లో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ యొక్క దృఢమైన లక్ష్యం ను ప్రదర్శిస్తుందని ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపక్ పాట్కర్ చెప్పారు. గతంలో ఫుల్లర్టన్ ఇండియా హెూమ్ ఫైనాన్స్ కంపెనీగా గుర్తింపు పొందిన ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి , తమ విస్తృతమైన అనుభవం, బలమైన పేరెంటేజ్, దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ మరియు బలమైన రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ తో గృహ , గృహాభివృద్ధి , గృహ నిర్మాణం , గృహ విస్తరణ తో పాటుగా తనఖా రుణాలు మరియు మధ్య స్థాయి డెవలపర్‌లకు కొత్త లేదా పునఃవిక్రయం వాణిజ్య ఆస్తి, వాణిజ్య ప్లాట్లు మరియు నిర్మాణ ఫైనాన్స్ కోసం రుణాలు సహా విస్తృతమైన రుణాల పోర్ట్‌ఫోలియోను కలిగి వుందని తెలిపారు.

658వ రోజు "జనం కోసం - జనసేన"

విశాలాంధ్ర - గోకవరం : జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాఠం శెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమం బుధవారం నాడు గోకవరం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటంశెట్టి సూర్యచంద్ర, శ్రీదేవి దంపతులు గ్రామంలో ఉన్న ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ జనసేన పార్టీ సిద్ధాంతాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేసి రాబోయే రోజుల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాటంశెట్టి వెంట జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, గోకవరం మండల రైతు విభాగం అధ్యక్షులు ప్రగడ ప్రభ, మండల ప్రధాన కార్యదర్శి అల్లాడ త్రిలోక్ కుమార్, గోకవరం గ్రామ అధ్యక్షుడు పదిలం మురళి, వీర లంకపల్లి గ్రామ అధ్యక్షుడు మామిడిపల్లి నాగేశ్వరరావు, గోకవరం మండల జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలు 15 రోజులకు చేరుకున్నాయి. దీక్షకు మద్దతుగా పాల్గొన్న మాజీ శాసనమండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం చంద్రబాబు అక్రమ అరెస్ట్ తీవ్రంగా ఖండిస్తూ చేయని తప్పుకు గత 19 రోజులుగా చంద్రబాబు నాయుడు అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి జైల్లో పెట్టడాన్ని ఖండించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటూ టిడిపి నేతలు గాడిదకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్ధాని శ్రీనివాస్, దొమ్మేటి రమణ కుమార్, ఉదయ్, కురసాల శివ బాబు, సత్తి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండే క్షణాల్లో ప్రాణాలు పోయాయి

- పిడుగుపాటు సంఘటనలో ప్రత్యక్ష సాక్షి విశాలాంధ్రకు చెప్పిన వివరాలు

విశాలాంధ్ర - లింగపాలెం : రెండే క్షణాల్లో ఊహించని విధంగా ఇద్దరిని మృత్యువు కబళించిందని మృత్యుబారిన పడిన వారి కంటే మూడడుగులు ముందు ఉండటంతో మృత్యు బారి నుండి బయటపడ్డానని పాచ్చానగరంలో పిడుగుపాటు సంఘటనను ప్రత్యక్షంగా చూసిన సొంగా జోత్న్న వివరించింది. పిడుగుపాటుకు సంబంధించిన వివరాలను విశాలాంధ్ర సేకరించింది. ఈసంఘటనలో ప్రాణాపాయం నుంచి బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జోత్న్న ఆవేదనతో వివరాలు తెలిపింది. పత్తి చేలో పనిచేస్తుండగా భారీ వర్షం పడింది. వర్షానికి తడిసిపోతుండటంతో దగ్గరలో ఉన్న టేకు చెట్టు కిందకు వచ్చా. ఈలోపు ఉరుములు, మెరుపులు భయంకరంగా వస్తుండటంతో చెట్టు కింద ఉన్న వాళ్ళం ముందుకు అడుగులు వేశాం. తాను మూడు అడుగులు ముందున్నాను. ఈలోగా పిడుగుపడింది. ఈ అదురుకు 20 అడుగుల దూరంలో పొలంలో పడ్డాను. నేను పడిన కొద్దిక్షణాల్లో దేవమాత వచ్చి నాపైన పడింది. పడగానే పక్కనే ఉన్న బురద నీటిని తాగేసి అక్కడే ప్రాణాలు వదిలింది. మరోవైపు మనీషా(చిన్నారి) పడింది. ఆమె అక్కడే జీవచ్ఛవం అయ్యింది. చనిపోయిన ఇద్దరు చెప్పులు వేసుకోలేదు. నా కాళ్ళకు చెప్పులు ఉన్నాయి. వీరికంటే కొద్దిగా ముందు ఉన్నాను. అదే నా ప్రాణాలు కాపాడింది. ముగ్గురం కలిసి పనికి వచ్చాం. నా సహచరులు ఇద్దరు ఈ ప్రమాదంలో మృతి చెందటం తట్టుకోలేకపోతున్నానని తెలిపింది.

కొనసాగుతున్న టీడీపీ నిరసనలు

విశాలాంధ్ర - జగ్గంపేట : టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో నిరసనలు కొనసాగుతున్నాయి. జగ్గంపేట క్లస్టర్ ఇంచార్జ్ జీను మణిబాబు ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు 15వ రోజు కొనసాగాయి. జగ్గంపేట, కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల టీడీపీ నేతలు దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నల్ల కండువాలు వేసి దీక్షల్లో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు బనాయించారన్నారు.

ఐ పోలవరంలో అట్టహాసంగా 'వరల్డ్ టూరిజం డే'

విశాలాంధ్ర - ఐ పోలవరం : ప్రపంచ టూరిజం డేను పురస్కరించుకుని డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో కార్యక్రమం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐ పోలవరం నందు ఘనంగా బుధవారం అట్టహాసంగా జరిగాయి. టూరిజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఐ పోలవరం జడ్పిటిసి సభ్యులు ముదునూరు సతీష్ రాజు, ఎంపీపీమోర్త రాణి, మీరేం జ్యోతిలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం రీజినల్ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి నాయుడు, జిల్లా టూరిజం ఆఫీసర్ వి వెంకటాచలం, రాజమండ్రి ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ కార్యక్రమాలు కోనసీమ జిల్లాలోని జిల్లా స్థాయికి ఎంపికైన 14 పాఠశాలల విద్యార్థులకు టూరిజం పై అవగాహన కల్పించేలా డ్రాయింగ్, వకృత్వం మరియు రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు, మరియు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం లోస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ రేవు సౌరెడ్డి, పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వీధి సురేష్ బాబు, స్టాఫ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, సైన్స్ టీచర్ ఎమ్ శాంతకుమార్, సోషల్ టీచర్ గోలకోటి రాంబాబు, క్రాఫ్ట్ టీచర్ వసంత లక్ష్మి, ఏపీ టూరిజం ఆఫీస్ సిబ్బంది ఉదయ్ కుమార్, త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.